నేటి నుంచి శ్రీప్రసన్న వెంకటరమణ స్వామి కల్యాణోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లె

పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో బుధవారం నుంచి కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ మాజీ చైర్మన్ బింగి పాండు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం ఆరు గంటలకు విశ్వక్సేన ఆరాధన పుణ్యా వచనం కలశారాధన, రాత్రి 8.30 గంటలకు పరివార హోమం, తీర్థ ప్రసాదములు వినియోగం ఉంటుందన్నారు. గురువారం విశ్వక్సేన ఆరాధన పుణ్యా వచనం, మహా సుదర్శన కలశ ప్రతిష్ట మహా సుదర్శన హోమం హయగ్రీవ హోమం మహా పూర్ణాహుతి మూలవర్లకు కలశ అభిషేకం తరువాత శ్రీదేవి, భూదేవి, లక్ష్మి శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం చిన్నపిల్లలకు సరస్వతీ పూజ అక్షరాభ్యాసం జరుగుతుందన్నారు. తదనంతరం అన్న ప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు. సాయంత్రం ఏడు గంటలకు పౌర్ణమి సందర్భంగా శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి గరుడ వాహనంపై ఊరేగుతారని తెలి పారు. సమావేశంలో కార్యనిర్వహణ అధికారి, అర్చకులు గోవర్ధన్‌బట్టర్, దివ్యభారతి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- 17న చలో విజయవాడను జయప్రదం చేయండి
- ఎపి గ్రామ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రామయ్య

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న దీర్ఘ కాల సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 17న నిర్వహించే చలో విజయవాడను జయప్రదం చేయాలని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పిటిఎం పల్లిలో నిర్వహించిన పంచాయతీ కార్మికుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 8 నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ, పిఎఫ్ చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. హైకోర్టు తీర్పు ప్రకారం ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికను రెగ్యులర్ లిస్ట్ ప్రపోజల్ నివేదిక ప్రభుత్వానికి సకాలంలో అందించాలని పేర్కొన్నారు. గౌరవ అధ్యక్షులు ఎ.రామాంజులు, ప్రధాన కార్యదర్శి ఎస్. సురేంద్ర బాబు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రీన్ అంబాసిడర్‌లకు కొన్ని పంచాయతీలకు పూర్తిగా చెల్లించలేదన్నారు. నాణ్యమైన పనిముట్లు, లీవులు అమలు చేయాలన్నారు. బ్యాంక్‌ల ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. మేజర్ పంచాయతీలలో కనీస వేతనం రూ. 26 కోరారు. అనంతరం 17న చలో విజయవాడ కరపత్రాలు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవరాయులు, ఎ.వి. రమణ, అంజి, మురళి, రెడ్డెయ్య, సుభద్ర, లక్ష్మిదేవి, గంగులు, శ్రీరాములు, కార్మికులు పాల్గొన్నారు.

సుండుపల్లె : చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామయ్య అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు రూ.26 వేలు జీతం ఇవ్వాలన్నారు. ప్రతి నెల 5వ తేదీనలోగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, సహాయ కార్యదర్శి ఓబులేష్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

‘యువత భవితను దెబ్బతీసింది జగనే’

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

యువత భవిష్యత్తును దెబ్బతీసింది జగన్మోహన్ రెడ్డేనని, నేడు యువత పోరుతో దొంగాట మొదలుపెట్టారని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్లమెంట్ క్యాంప్ కార్యాలయంలో టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 12వ తేదీన వైసిపి చేపట్టే ఫీజుపోరు కార్యక్రమం జగన్మోహన్‌రెడ్డి ఇంటి ముందు చేయాలన్నారు. రూ.4,271 కోట్లు ఫీజు, వసతి దీవెన బకాయిలు పెట్టింది జగన్ ప్రభుత్వమే కదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలల్లోనే విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ రూ.788 కోట్లు విడుదల చేశారన్నారు. 2014-2019 మధ్య చంద్రబాబు ప్రభుత్వం 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ ఇచ్చారని, దాన్ని జగన్ 9 లక్షల మందికి కుదించి ఏడు లక్షల మంది విద్యార్థులకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఆరు లక్షల మందికి చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వగా దాన్ని జగన్ ప్రభుత్వం రద్దుచేసి యువతకు ద్రోహం చేశారని మండిపడ్డారు. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ, ప్రతి ఏటా జనవరిలో జాబ్ కేలండర్, మెగా డిఎస్‌సి హామీపై జగన్ మాట తప్పి మడమ తిప్పారని ఎద్దేవా చేశారు. కమీషన్ల కక్కుర్తి కోసం పరిశ్రమలపై దాడి చేసి జగన్ ప్రభుత్వం పెట్టుబడులన్నీ పొరుగు రాష్ట్రాలకు తరిమేసి నిరుద్యోగం పెంచారని పేర్కొన్నారు. జగన్ బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సప్లై నిధులు రూ.లక్ష కోట్లు దారి మళ్లించి స్వయం ఉపాధి పథకాలు నీరు కార్చారని పేర్కొన్నారు. 2014-2019 మధ్య చంద్రబాబు పాలనలో ప్రభుత్వ, ప్రయివేటు రంగంలో 12 లక్షల ఉద్యోగాలుతో యువతకు ఉపాధి కల్పించారన్నారు. 2014లో ఆంధ్రప్రదేశ్ ఐటిలో 5 వేల ఉద్యోగాలు మాత్రమే ఉండగా 2019 నాటికి ఐటి మంత్రి నారా లోకేష్ 35 వేలకు పెంచారన్నారు. గడిచిన తొమ్మిది నెలల్లోనే 6.5 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించారని, నాలుగు లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి జరుగుతుందన్నారు. యువ పోరు పేరుతో మరోసారి యువతను మోసం చేసే జగన్ మరోసారి జగన్నాటకం ఆడుతున్నారన్నారు. ఉద్యోగాల కల్పన చంద్రబాబుకే సాధ్యమని, యువత భవిత నారా లోకేష్‌తోనే ఉందన్నారు. పోరు దీక్షలు ఎన్ని చేసినా కూడా రాష్ట్రంలోని విద్యార్థులు యువత నమ్మరన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షులు శివప్రసాద్, నియోజకవర్గ నాయకులు ముబిసిర్ పాల్గొన్నారు.

పర్యాటక ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో చేపడుతున్న పర్యాటక ప్రాజెక్టులను త్వరితగతిని పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యాటక కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, వాటికి సంబంధించిన రహదారుల నిర్మాణం, పర్యాటక ప్రాజెక్టులకు భూమి కేటాయింపు, ఒక జిల్లా ఒక పర్యాటక ప్రాజెక్టు కింద జిల్లాలో చేపట్టబోయే వివిధ ప్రాజెక్టులు, హార్స్‌లీహిల్స్‌లో చేపట్టబోయే టెంట్ సిటీ ప్రాజెక్టు, అన్నమాచార్యుల వారి గురించి, అన్నమాచార్య కీర్తనలను ప్రచారం చేయడం తదితర అంశాలపై కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ముఖ్యమైన పర్యాటక కేంద్రాలకు రహదారుల నిర్మాణం త్వరగా పూర్తవ్వాలని అధికారులను ఆదేశించారు. గిరిజన కార్పొరేషన్ వారు అరకు కాఫీ కోసం అడిగిన స్థలాన్ని కేటాయించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రాజెక్ట్ కింద అన్నమయ్య జిల్లాలో చేపట్టనున్న ప్రాజెక్టులకు సంబంధించిన నివేదికలను వెంటనే సమర్పించాలని జిల్లా పర్యాటకశాఖ అధికారిని ఆదేశించారు. అన్నమాచార్యులు వారి కీర్తనలను ప్రచారం చేసేందుకు టిటిడి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

వారితో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని జిల్లా పర్యాటకశాఖ అధికారిని ఆదేశించారు. హార్స్‌లీ హిల్స్‌లో నిర్మించబోతున్న టెంట్‌సిటీపై పూర్తిస్థాయి నివేదికను వెంటనే సమర్పించాలని జిల్లా పర్యాటకశాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా డిఎఫ్ఒ, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, రాయచోటి, మదనపల్లె, బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచండి

న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ ఆసుపత్రులంటే ప్రజల్లోని అపోహలను దూరం చేసి, అభిమానాన్ని, నమ్మకాన్ని పెంపొందించాలని రాయచోటి ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ వెంకటశివ తెలిపారు. పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి ప్రారంభించి ఏడాది పూర్తైన సందర్భంగా ఆసుపత్రిలో సేవలను ఏడు విభాగాలుగా చేసి, వాటిలో విధులు నిర్వహించే వారి పనితీరును గుర్తించేందుకు మంగళవారం పోటీ నిర్వహించారు. ఇందుకోసం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి మత్తు విభాగం వైద్యులు డాక్టర్ వెంకట శివ, మహల్ కమ్యూనిటీ హెల్ప్ సెంటర్ హెడ్ నర్స్ బీబీ ఫరీష్ పర్యటించి నివేదికలను తయారు చేశారు. వారు ఆసుపత్రిలోని అన్ని విభాగాలను క్షుణ?ంగా తనిఖీ చేసి, అలాగే రోగులతోనూ మాట్లాడి మార్కులు ఇచ్చారు. ఈ మార్కుల ఆధారంగా సిబ్బంది పనితీరుకు గ్రేడింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇది కేవలం ఆసుపత్రి సిబ్బందిలో పోటీ తత్వాన్ని, స్ఫూర్తిని నింపేదుకు మాత్రమేనని, ఇందులో ఎవరూ భేషజాలకు పోకుండా భవిష్యత్తులో సేవలందించడంలో ఆసుపత్రి గుర్తింపును విస్తృతపరచడానికి మరింత కృషి చేసేలా నైపుణ్యాలను పెంచుకోవాలని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ వెంకటశివ ప్రథమ, ద్వితీయ స్థాయి బహుమతులను, మిగిలిన వారికి ప్రోత్సాహక బహుమతులను ప్రధానం చేశారు. ప్రథమ బహుమతిని ప్రసూతి విభాగానికి ప్రాతినిధ్యం వహించిన హెడ్ నర్స్ అమ్మాజీ, స్టాఫ్ నర్సులు లావణ్య, జ్యోతి, రేష్మ, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్లు బాదుల్లా, సరిత, పారిశుధ్య సిబ్బంది ఎర్రమ్మ, అమృత బృందానికి అందజేశారు. ద్వితీయ బహుమతిని రోగ నిర్ధారణ విభాగము (లేబరేటరీ, ఎక్స్ రే విభాగము) గెలుచుకుంది. ఈ విభాగానికి ప్రాతినిధ్యం వహించిన హెడ్ నర్స్ పుష్పలత, ల్యాబ్ టెక్నీషియన్ మల్లికార్జున, రేడియోగ్రాఫర్ శ్రీనివాసులు, జిడిఎ స్వామినాథన్, పారిశుద్ధ్య కార్మికులు నాగరాణి, నసీబ్ జాన్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ సరస్వతమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ షరీఫ్ జాన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ భాస్కర్, ఆఫీస్ సూపరింటెండెంట్ శివ, హెడ్ నర్సులు, ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

ప్రతి పాఠశాలలోనూ స్కౌట్ యూనిట్ తప్పనిసరి

- డిఇఒ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - రాయచోటి

అన్ని రకాల ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణం గాలివీడు రోడ్డు మార్గాన ఉన్న అర్చన కళాశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం ఆయన సందర్శించారు .ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ పొందిన విద్యార్థులకు శారీరక దారుఢ్యంతో పాటు దేశభక్తి, సేవాభావం అలబడుతుందన్నారు. స్కౌట్ విద్యార్థులకు ఇంజినీరింగ్, వైద్య విద్య తదితర అడ్మిషన్స్‌లో, రైల్వే ఉద్యోగాలలో రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అర్చన కళాశాల కరస్పాండెంట్ మదన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణ ద్వారా క్రమశిక్షణ, నిజాయితీ, సుగుణ శీలత, ధైర్య సాహసాలు, సేవాగుణం లాంటి ఉత్తమ పౌరసత్వ లక్షణాలు విద్యార్థుల్లో పెంపొందుతాయన్నారు. స్కౌటిజం ద్వారా మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ పిఎం శ్రీ పాఠశాలల నుండి వచ్చిన 250 మంది విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానాంలో ఐదు రోజులు పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ డబ్ల్యు బి నిర్మల, స్కౌట్ మాస్టర్‌లు నాగరాజ, గైడ్ కెప్టెన్లు సుజాత, గోవిందమ్మ, స్వర్ణలత, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పుత్త పద్మ

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశాభివృద్ధిలో మహిళలు చాలా కీలక పాత్ర పోషిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని నేటితరం విద్యార్థులు రాణించాలని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ పిలుపునిచ్చారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలోని తాళ్లపాక అన్నమాచార్య సేనేట్ హాల్లో ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' ఎక్సెలరేట్ యాక్షన్ అనే థీమ్‌తో మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి సభకు అధ్యక్షత వహించగా గౌరవ అతిథిగా హాజరైన ఆచార్య పద్మా మాట్లాడుతూ పురుషులతో సమానంగా సమర్ధవంతంగా పనిచేస్తున్న మహిళలను అభినందించారు. విద్య, ఆరోగ్యం, ఐటి, పరిశోధన, అంతరిక్ష రంగాల వంటి అన్ని రంగాల్లో మహిళలు అత్యంత సమర్థవంతంగా రాణిస్తున్నారని ఉదహరించారు. మహిళలు తమ ఆకాంక్షల మేరకు సమానత్వం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలు తమ ఆరోగ్యం, బాధ్యతలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. గౌరవ అతిథి ఆంధ్ర ప్రదేశ్ సంగీతనృత్య అకాడమీ సభ్యురాలు డాక్టర్ కోడూరు సుమన శ్రీ మాట్లాడుతూ కవయిత్రి మొల్ల, సావిత్రీబాయి పూలేలను స్మరించుకునే రోజు ఇది అన్నారు. మహిళలు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నేటి సమాజంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. మహిళ దినోత్సవం సందర్భంగా పలు విభాగాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన వారికి అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైవీయూ ఉమెన్ సెల్ కన్వీనర్ ఆచార్య విజయలక్ష్మి, సభ్యులు ప్రొఫెసర్ మాధవి, సహ ఆచార్యులు డాక్టర్ అనూ ప్రసన్న, డాక్టర్ ఉస్మాన్ బాష, ఖాజా, సుమలత, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి అధికారుల నియామకం

వైఎస్ఆర్‌కు సౌరబ్‌గౌర్, అన్నమయ్యకు వినయ్‌చంద్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రభుత్వం జిల్లా ఇన్‌ఛార్జి బాధ్యులుగా సీనియర్ ఐఎఎస్ అధికారులను నియమించింది. సోమవారం రాష్ట్రంలోని 26 జిల్లాల వారీగా ఐఎఎస్ అధికారులను నియమించింది. వైఎస్ఆర్ జిల్లా ఇన్‌ఛార్జి అధికారిగా సౌరబ్‌గౌర్, అన్నమయ్య జిల్లాకు వాడరేరు వినయ్‌చంద్‌లకు బాధ్యతలు అప్పగించింది. వీరిద్దరూ ప్రభుత్వ కార్యక్రమాలను పర్యవేక్షణ, అమలు బాధ్యతలను చూడాలి. జిల్లాలోని ఆయా శాఖల మధ్య సమన్వయం, సమస్యలను సత్వరం పరిష్కరించాలి.15 రోజులకు ఒకసారి సమీక్షా సమావేశాలు నిర్వహించాలి. నెలకు రెండు సార్లు గ్రామాల్లో బస చేయాలి. నెల వారీగా ప్రోగ్రెస్ రిపోర్టును ఇన్‌ఛార్జి, ప్రధాన కార్యదర్శులకు అందజేయాలి. వీరికి సహాయకారులుగా జోనల్ ఇన్‌ఛార్జులుగా సీనియర్ ఐఎఎస్ అధికారులను నియమించింది. వైఎస్ఆర్ జిల్లాకు జి.అనంతరాము, అన్నమయ్య జిల్లాకు ఎం.టి

సౌరబ్‌గౌర్

వినయ్‌చంద్

కృష్ణబాబులను నియమించింది. వీరిద్దరూ ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలకు వ్యూహాత్మక మార్గదర్శకత్వం వహించాలి. నెల వారీ సమీక్షలు నిర్వహించాలి. జిల్లా స్థాయి కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు ప్రభుత్వ కార్యక్రమాల్లో సహాయ పడాలి. ఉదాహరణకు ప్రతి నెలా ఒకటవ తేదీన ఫింఛన్ల పంపిణీ, మూడవ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను పర్యవేక్షించాలి. ప్రజాఫిర్యాదుల పరిష్కారస్థితిని సమీక్షించాలి. ప్రభుత్వ కార్యక్రమాల్లో అవాంతరాలను గుర్తించి, జాప్యానికి గల కారణాల విశ్లేషించాలి. ముఖ్యమైన ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు, వ్యయాల్ని సమీక్షించాలి. జిల్లా పురోగతి సమస్యలను, సిఫారసులను ముఖ్యకార్యదర్శికి నివేదించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

ఎస్‌సి, ఎస్‌టి సెల్ పోలీసుస్టేషన్లకు డిఎస్‌పిలను నియమించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక పోలీసుస్టేషన్లకు డిఎస్‌పిలను నియమించాలని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని బహుజన సేన ముఖ్య కార్యవర్గ సమావేశం నగరంలోని ఓ ప్రయివేటు పంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి కేసుల సత్వర పరిష్కారం కొరకు జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులను గౌరవిస్తూ ఎపిలో 2014లో ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టాన్ని బలపరిచే విధంగా పోలీసు వ్యవస్థలో ప్రత్యేకంగా ఎస్‌సి, ఎస్‌టి సెల్‌ను ఏర్పాటు చేసి, ప్రత్యేక డిఎస్‌పిలను నియమించారని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సెల్ వల్ల బాధితులకు విచారణ సమయంలో రక్షణ, ముద్దాయిలను అరెస్టు చూపడం, ఛార్జిషీట్ దాఖలు చేయడం వల్ల సత్వర న్యాయం జరగడం వల్ల బాధిత వర్గాలకు ఎస్‌సి, ఎస్‌టి సెల్ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఎన్నికల ముందే 2024లో 98 మంది ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పిలను రద్దు చేసి, బాధిత వర్గాలకు తీరని అన్యాయం చేశారన్నారు. దీని ప్రభావం జనరల్ కేసులను విచారించే డిఎస్‌పిలపై పడడంతో ఎస్‌సి, ఎస్‌టి కేసుల ప్రాధాన్యత తగ్గడంతో పాటు విచారణ జాప్యం అవ్వడంతో చాలా కేసులు పెండింగ్‌లో పడ్డాయన్నారు. దీని వల్ల ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం ఉద్దేశం నీరు గారిపోవడంతో, బాధిత వర్గాలైన ఎస్‌సి, ఎస్‌టి సమాజం ఎంతో నష్టపోతుందని వాపోయారు. సత్వరమే ఎస్‌సి, ఎస్‌టి సెల్లో డిఎస్‌పిలకు పోస్టింగ్‌లు ఇచ్చి నియమిం

మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బహుజన సేన నాయకులు

చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24న రాష్ట్ర రాజధాని విజయవాడ ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాధర్నా కార్యక్రమానికి ఎస్‌సి, ఎస్‌టి ప్రజాసంఘాలు, అంబేద్కర్ వాదులు, విద్యార్థులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం చలో విజయవాడ మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో బహుజనసేన వ్యవస్థాపక నాయకులు పి.జయశంకర్, శ్రీరాములు, లక్ష్మీనారాయణ, రాఘవేంద్ర యాదవ్, హరి, లారా, నూర్ ఆలాం, నాయకులు రూపక్ నాయక్, మేరీ, లక్ష్మి, జెన్నీత్, షాలేం పాల్గొన్నారు.

హెల్త్ సెక్రటరీల సమస్యలపై చర్చించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మెడికల్ హెల్త్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న గ్రామ వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల (ఎఎన్ఎంల) సమస్యలని సత్వరమే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీలావతి మెడికల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గతంలో అనేకసార్లు మా సమస్యలను అధికారులకు తెలియజేసినప్పటికీ సరైన పరిష్కారం జరగలేదన్నారు. తమ సమస్యలపై తక్షణమే చర్చలు జరిపి పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా ఎఎన్ఎంలను పూర్తిగా మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్ పరిధిలోకి చేర్చి, ద్వంద్వ నియంత్రణను రద్దు చేయాలని, ఆన్లైన్ అప్లికేషన్లు తగ్గించి, అదనపు పనుల ఒత్తిడిని తగ్గించడంతో పాటు మిగతా శాఖల పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, మెడికల్ సంబంధిత పనులు మాత్రమే అప్పగించాలని కోరారు. ఫీల్డ్ లెవల్ లోనే బయోమెట్రిక్ హాజరును నమోదు చేసే వెసులుబాటు కల్పించి, సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న ఎఎన్ఎంలకు, పిహెచ్‌సిలో పనిచేసే ఎఎన్ఎంల వేతనంతో సమానంగా చెల్లించాలని, ప్రమోషన్ ఛానల్ ఏర్పాటుచేసి,పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు తక్షణమే పూర్తి చేసి, హెల్త్ అసిస్టెంట్లకు అందిస్తున్న అన్ని రకాల అలవెన్సులను ఏఎన్ఎంలకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సర్వే పూర్తిగా అమలు చేయడానికి మరికొంత సమయం ఇచ్చి, తదితర న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. గతంలో అనేక మార్లు ఈ అంశాలపై అధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి స్పందన లేదన్నారు.

బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు పరిమళ

ప్రజ్ఞా వికాసం పరీక్ష విజయవంతం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో మన్నూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇ.గీతిక ప్రథమ స్థానంలో నిలవగా ద్వితీయ స్థానంలో సబీహ నిలిచింది. పట్టణంలో ఉన్న ప్రతి ప్రభుత్వ, ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల నుండి ప్రథమ, ద్వితీయ స్థానంలో వచ్చిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.పరిమళ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులందరూ కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి అనుకున్న లక్ష్య సాధన కోసం ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకొని వారి లక్ష్యాన్ని నెరవేర్చే విధంగా ఉన్నతమైన చదువులు చదివి ఈ ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మదన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఓబులేష్, వెంకట రామరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, అబ్రహం పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉన్నత విద్యుతోనే గొప్ప ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నమాచార్య ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి ఎస్.ప్రనుష్ అన్నారు. మంగళవారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన ఆలమ్నస్ ఇంటరాక్షన్ కార్యక్రమంలో ఆయన వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఆయన స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ విద్యను అభ్యసించి ఆ తర్వాత నైపర్ అహ్మదాబాద్‌లో ఎంఫార్మసీ విద్యను అభ్యసించి నోవార్టీస్ కంపెనీలో అసోసియేట్ అనలైటికల్ శాస్త్రవేత్తగా సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బీఫార్మసీ పూర్తయిన తర్వాత తన ఎంఫార్మసీ విద్యను లేదా ఎమ్మెస్ విద్యను మంచి కళాశాలలో అభ్యసించడం వల్ల గొప్ప ఉద్యోగ అవకాశాలు మల్టీ నేషనల్ కంపెనీస్‌లో సులభంగా పొందగలరని తెలిపారు. అంతేకాకుండా గొప్ప విద్యాసంస్థల్లో విద్యను అభ్యసించినట్లయితే తమ ఉద్యోగంలో కూడా ప్రమోషన్లకు మరియు ఇతరుల కంపెనీల ఆహ్వానాలకు సులభంగా ఉంటుందని, వృత్తిలో పైస్థాయికి నాలుగైదు సంవత్సరాలకే వెళ్లవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థి నేడు అత్యున్నత స్థాయిలో ఉండడం తమకు గర్వకారణంగా ఉందని తెలిపారు. అనంతరం ప్రనుష్ కుమార్ ను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ ఇంటరాక్షన్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు విద్యలో కంపెనీ ఉద్యోగాలలో తమ సేవల పట్ల ఉద్యోగ అవకాశాలు, ఇతర విద్యా అవకాశాల గురించి విద్యార్థులకు సందేహాలు తీర్చారు. కళాశాల అల్మెస్ అసోసియేషన్ టీం సభ్యులు వై.ప్రదీప్ కుమార్, మణిదీప్ రాయల్, డాక్టర్ వి.సరోవర్ రెడ్డి, అధ్యాపకులు కె నాగలక్ష్మి, వెంకట సౌమ్యశ్రీ, బి.పూజ పాల్గొన్నారు.

ప్రనుష్ కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపల్

మాట్లాడుతున్న పక్కీరయ్య

విద్యార్థులను మోసం చేసింది వైసిపి ప్రభుత్వమే

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాష్ట్రంలో ఉన్న విద్యార్థులు, యువతను మోసం చేసింది గత వైసిపి ప్రభుత్వమేనని తెలుగు యువత మండల అధ్యక్షులు కొలిమి పక్కీరయ్య పేర్కొన్నారు. మండలంలో తెలుగు యువత పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో నిరుద్యోగ యువతకు చేసిందేమి లేదని అన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ కేలండర్ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందని అన్నారు. సిఎం చంద్రబాబునాయుడు 2014-19 ఫీజు రీయింబర్స్‌మెంట్ పుష్కలంగా ఇచ్చారని అన్నారు. వైసిపి నాయకులు యువత పోరు పేరుతో అత్యుత్సాహం ప్రదర్శి స్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తుందని అన్నారు. కార్య క్రమంలో తెలుగు యువత మండల నాయకులు సిద్దయ్య లాయర్, యూత్ కార్యదర్శి మండల కార్యదర్శి రామాంజనేయులు, రమణ పాల్గొన్నారు.

అసంపూర్తి గృహాలకు అదనపు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

కలకడ :మాట్లాడుతున్న ఎఇ నాగమనినాయక్

అసంపూర్తి గృహాలకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందిస్తోందని గృహ నిర్మాణ శాఖ మండల ఇన్‌ఛార్జి అమర్నాథ్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు మంజూరై ఇంకా వివిధ దశలలో అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తి చేయటానికి అదనంగా ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించనుందని తెలిపారు. స్వర్ణాంధ్ర 2027 విజన్ సహకారంలో భాగంగా 2029 నాటికి అందరికీ ఇల్లు నిర్మించాలనే లక్ష్యంతో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపట్టిందన్నారు. వివిధ దశల లో అసంపూర్తిగా ఉన్న లబ్ధిదారులైన ఎస్‌సి, బిసిలకు రూ.50వేలు, ఎస్‌టిలకు రూ.75 వేలు అదనంగా ఆర్థిక సాయాన్ని అందిస్తుందని తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీ నాటికి అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. మండలంలో మొత్తం 2105 గృహాలు మంజూరు కాగా, 1633 గృహాల నిర్మాణాల పూర్తయినట్లు తెలిపారు. ఇంకా వివిధ దశలలో 469 గృహాలు ఉండగా, పూర్తిగా ప్రారంభించని మూడు గృహాలు ఉన్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం మండల గృహ నిర్మాణ శాఖ అధికారులను లబ్ధిదారులు సంప్రదించి, సమాచారాన్ని తెలుసుకొని, ఇళ్ల నిర్మా ణాలను పూర్తి చేయాలని అయన కోరారు. **కలకడ :**రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణాలకు అదనంగా డబ్బులు చెల్లించడం జరుగు తుందని హౌసింగ్ ఎఇ నాగము నినాయక్ పేర్కొన్నారు. 2019-24 సంవత్సరం మధ్య మంజూరైన ఇళ్ల నిర్మా ణాలకు ఎస్‌సి, బిసిలకు రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ.75వేలు అదనంగా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసు కున్న నిర్ణయంతో నిరుపేదలు ఇల్లు నిర్మించుకోవడానికి ఎంత అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.

బ్యాంకులకు బిసి రుణాల జాబితా

ప్రజాశక్తి-గాలివీడు

మండలానికి బీసీ కార్పొరేషన్ కింద 41 యూనిట్లు మంజూరు కాగా అదనంగా మరో నాలుగు యూనిట్లకు బ్యాంకులు అర్హుల జాబితాను పంపినట్లు ఎంపిడిఒ సిఎం.జవహర్‌బాబు పేర్కొన్నారు. ఇక్కడ ఇంటర్వ్యూ హాజరైన వారి అభ్యర్థులు జాబితాను ఆయా బ్యాంక్ శాఖలకు జాబితా పంపామని రుణాలకు దరఖాస్తు చేసుకున్నల లబ్దిదారులు ఆ బ్యాంక్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్లను సంప్ర దించాలి పేర్కొన్నారు.

రేపటి నుంచి మల్లూరమ్మ జాతర

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని మల్లూరు పంచాయతీ, కొత్తపల్లె గ్రామంలో మాం డవ్యనది ఒడ్డున వెలసియున్న శ్రీ మల్లూరమ్మ జాతరను గురు, శుక్ర వారాల్లో నిర్వ హిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర ఉత్సవాలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్ల ను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 13న నిండు తిరునాల, 14న మైల తిరునాల జరు గుతుందని తెలిపారు. జాతరలో భక్తులను ఆకట్టుకునేందుకు చెక్కభజనలు, కోలాటాలు, జబర్దస్త్ ప్రోగ్రాం తోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ జాతరకు జిల్లా వాసులే కాకుండా బెంగళూరు, చిత్తూరు తదితర ప్రాం తాల నుంచి జనం వస్తారని తెలిపారు. జాతరకు వచ్చే ప్రజలను దృష్టిలో ఉంచుకొని తాగునీరు, అన్నదానం, అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

బ్రహ్మంగారి సన్నిధిలో యాంకర్ శ్యామల

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో స్వామిని మంగళవారం వైసిపి పి రాష్ట్ర అధికార ప్రతినిధి, యాంకర్ శ్యామల, ఆమె భర్త దర్శించుకున్నారు. వీరికి ఫిట్‌పర్సన్ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో సిబ్బంది ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఎనిమిదో తరం మనవడు శ్రీ వెంకటాద్రి స్వామి, శ్రీ దత్తాత్రేయ స్వామి వారిని దర్శించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. శ్యామల దంపతులను సన్మానించారు. కాలజ్ఞానం విశేషాలను వివరించారు. కార్యక్రమంలో బద్వేల్ జడ్‌పిటిసి పోలిరెడ్డి, అమగంపల్లి ప్రభాకర్‌రెడ్డి, ఆమగంపల్లి సర్పంచ్ భర్త సురేష్, మఠం వైసిపి నాయకులు బద్దెల శ్యాంసుందర్‌రెడ్డి, యల్లటూరు శివారెడ్డి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పశువైద్యశాఖ డిడి డాక్టర్ కె.విశ్వేశ్వర్‌రెడ్డి

కలికిరి : పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-కలికిరి

పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి పట్ల పశువైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిడి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీ వరకు పశుసంవర్ధక శాఖ తరపున గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశువులకు పంపిణీ చేయు కార్యక్రమం జరుగుతున్న విషయం విదితమే. డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి మండలంలోని కొటాల గ్రామానికి విచ్చేసి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతిరోజూ పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఉదయం 9.30 వరకు రైతుల ఇంటి వద్దకే వెళ్లి పశువులకు టీకాల పంపిణీ చేయాలని సూచించారు. 4 నుంచి 8 నెలల మధ్య వయసున్న పెయ్య దూడలకు బ్రుసెల్లోసిస్ వ్యాధి టీకాలు వేయించాలని సిబ్బందిని సూచించారు. గాలికుంటు వ్యాధి టీకాల వలన పాలు తగ్గుతాయి లాంటి అపోహలు పెట్టుకోవద్దని రైతులని కోరారు. ఈ అవకాశాన్ని రైతులందరూ కచ్చితంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ కె.వెంకట మునినాయుడు, మండల పశువైద్యాధికారి డాక్టర్ గిరినాథ్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది పాలొన్నారు. **గాలివీడు :** పశుసంవర్ధక శాఖ తరుపున గాలికుంటువ్యాధి నివారణలో భాగంగా ఈ నెల 1 నుంచి 31 వరకు ఎఫ్ఎండి వాక్సినేషన్ మండలంలోని అన్ని గ్రామా ల్లో పశువులకు వేయడం జరుగుతోందని అన్నారు. మంగళవారం అరవీడు, గోరన్ చెరువులో టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించుటకు రాయచోటి ఉప సంచాలకులు డాక్టర్ మాల కొండయ్య గోరాన్ చెరువు, అరవీడులో పర్య టించి టీకాలు వేశారా లేదా అని ఆరా తీశారు. పాడి రైతులకు టీకాలు వేసుకోవడం వలన ఉపయోగాలు వివరించారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ టి.భాస్కర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గాలివీడు : వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ మాల కొండయ్య

104 సేవలు సద్వినియోగం చేసుకోండి : ఎంపిడిఒ

104 సేవలను తనిఖీలు నిర్వహిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-కలకడ

గ్రామీణ ప్రాంత ప్రజలు 104 సేవలను సద్వినియం చేసుకోవాలని ఎంపిడిఒ అబ్దుల్ రహీం పేర్కొన్నారు. మండలంలోని కోటగుడిబండ పంచాయతీ కోటగుడిబండ గ్రామంలో 104 సేవలను చేస్తున్న తీరును పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో 104 సేవలను గ్రామాలలోని ప్రజల దగ్గరకు వచ్చి సేవలందిస్తూ వారికున్న రోగాలను గుర్తించి ఉచితంగా మందులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ తమ గ్రామాల్లోకి వచ్చే 104 సేవలను గుర్తించి ప్రజలకు, విష జ్వరాలు, జలుబు తదితర జబ్బులకు ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మల్లికార్జున, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసేవలో ముందుండాలి

ప్రజా సేవలో సచివాలయం సిబ్బంది ముందు ఉండాలని ఎంపిడిఒ పేర్కొన్నారు. మండలంలోని కోటగుడిబండ సచివాలయాన్ని సందర్శించి తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు.గ్రామంలోని ప్రజలు అనేక సమస్యలతో సచివాలయానికి వస్తుంటారని, వారిని మర్యాద పూర్వకంగా పలకరించి, వారి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ప్రజలకు ఉన్న భూ సమస్యలు, ధ్రువీకరణ పత్రాలు తదితర అంశాలను పరిశీలించి వీలైనంత తొందరలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలను సచివాలయం చుట్టూ తిప్పుకోకుండా వారి సమస్యలపై దృష్టి సారించి వీలైనంత తొందరగా పరిష్కరించేందుకు చొరవ చేపట్టాలన్నారు. సచివాలయం సిబ్బంది ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, విఆర్ఒ విజయకుమారి ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే టిబి లేని సమాజం సాధ్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అవగాహనతోనే టిబిలేని సమాజ నిర్మాణం సాధ్యమౌతుందని ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు ప్రభాకర్ తెలిపారు. టిబి నివారణ, అవగాహన మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని గౌతమ్ ఉన్నత పాఠశాల, హోప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ రెండు వారాలకు పైబడి దగ్గు, రోజు రాత్రిపూట జ్వరం రావడం, ఛాతిలో నొప్పి, గస, ఆయాసం, నీరసం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, గళ్ళ పడటం, రక్తం చక్కలు గళ్ళలో కనిపించడం వంటి లక్షణాలు ఉంటే టిబి వ్యాధి అని అనుమానించి ఆశాకార్యకర్తను సంప్రదించి ప్రభుత్వ అస్పత్రిలో గళ్ళ పరీక్షలు చేయించాలని సూచించారు. టిబి వ్యాధి ఒకరి నుంచి మరొకరికి నోటి తుంపరల ద్వారా వ్యాపిస్తుందని, ఒకవేళ వ్యాధి ఉందని నిర్ధారణ ఐతే ఆరు నెలలు మందులు డాట్స్ ఆధ్వర్యంలో వాడాలన్నారు. చికిత్స కాలంలో రోగికి ప్రధానమంత్రి పోషణ అభియాన్ పథకం కింద పౌష్టికాహారం తీసుకోవడానికి వారి ఖాతాలో రూ. 1000లు జమ చేస్తారన్నారు. అనంతరం టిబి వ్యాధి నివారణకు బాధ్యతగా కృషి చేస్తామని విద్యార్థులతో ప్రమాణం చేయించి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మి నారాయణ, విజయలక్ష్మి, టీబి విభాగం సిబ్బంది శాంతి, వనజ కుమారి, సుశీల, తరుణ్ ఆరోగ్య సిబ్బంది నరసమ్మ, మమత, ధనలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ

తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నల్ల తిమ్మయ్యగారిపల్లి నడిగడ్డ అగ్రహారం నుంచి చెన్న య్యగారిపల్లి గ్రామం వరకు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అర్బన్ మిషన్ కింద ఎంపిడిఒ రాధా కృష్ణంరాజు ఆధ్వర్యంలో రూ.50 లక్షల వ్య యంతో తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారం భించారు. గతంలో టెండర్లు పిలవడం జరిగిందని ఆలస్యం కావడంతో నిధులు వెనక్కి వెళుతున్న తరుణంలో ప్రత్యేకంగా అనుమతి తీసుకొని కాంట్రాక్టర్ సందీప్‌కు పనులను అప్పగించినట్లు తెలిపారు. ఈపనులను ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ నాణ్యమైన పైపులతో పనులను త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికా రులు 38 అడుగుల లోతులో నీరు పడతాయని తెలపడంతో మార్చి, ఏప్రిల్ నాటికి ఎండిపోతాయని, 80 అడుగులు లోతులో బోరు వేస్తే ఎప్పటికీ నీరు ఉంటుందని తెలిపారు. ఎక్కువ లోతులో వేయడం వల్ల కలకాలం నీరు అందుబాటులో ఉంటుందని అన్నారు. ప్రజలకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.

పనులను పర్యవేక్షిస్తున్న ఎంపిపి

కాలిపోయిన మామి చెట్లను చూపుతున్న రైతు

అగ్ని ప్రమాదంలో మామిడితోట దగ్ధం

- రూ.5 లక్షలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

అగ్ని ప్రమాదంలో మామిడి తోట దగ్ధమై సుమారు రూ.5లక్షలు ఆస్తి నష్టం జరిగిన సంఘటన మంగళవారం మండలంలో వెలుగు చూసింది. బాధితుని కథనం మేరకు వివరాలు..కోసివారిపల్లి పంచాయతీ దిగువ ముత్రవారిపల్లెకు చెందిన రఘునాథరెడ్డి మూడు ఎకరాల్లో మామిడి, అల్ల నేరేడు, తోటను పెంచారు. తోట పూత పిందె దశలోఉంది. సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు పొలాల్లో నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి మామిడి తోటను అలుముకున్నాయి. మంటలు ఆర్పేందుకు ఎంత ప్రయత్నించినా సాధ్యపడలేదు. 30 అల్లనేరేడు, 30 మామిడి చెట్లు,40 టేకు చెట్లు, వేప చెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయని బాధితులు వాపోయారు. మామిడి తోటపై ఆశలు పెట్టుకుని వచ్చే ఆదాయంతో సంసారం గడపవచ్చునున్న ఆశ కూడా నిరాశ అయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం స్పందించి బాధిత రైతుకు నష్ట పరిహారంతో ఆదుకోవాలని కోరుతున్నారు.

ఒకే కుటుంబానికి రెండు జాబ్ కార్డులు

- సామాజిక తనిఖీలో బహిర్గతం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ 2023-24 ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు సామాజిక తనిఖీ నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లి గ్రామపం చాయతీ గ్రామసభలో సామాజిక తనిఖీ సిబ్బంది శోభారాణి విషయాలను వెల్లడించారు. ఆరు కుటుంబాలకు నిబంధనలకు విరుద్ధంగా రెండేసి జాబ్ కార్డులు మంజూరు చేసి రూ.1,48,819లు అదనంగా చెల్లించారని అన్నారు. కూలీలకు సౌక ర్యాలు కల్పించలేదని సామాజిక తనిఖీ సిబ్బందికి పనుల కు సంబంధించిన అంచనా పత్రాలు అందించలేదని సాంకేతిక సహాయకులు కొలతలు తక్కువ వేయడం వల్ల 836 మంది కూలీలు నష్టపోయారని తెలిపారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ నలుగురు రైతులు అందుబాటులో లేక కలవలేకపోయామని చెప్పారు. ఉపాధి హామీ సిబ్బంది కూలీలకు వారం వారం గ్రామసభలు నిర్వహించలేదని పేర్కొనారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, చెంద్రాయుడు, ఉపాధి సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలను వెల్లడిస్తున్న శోభరాణి

బాధితులకు చెక్కును అందిస్తున్న వరలక్ష్మీ

బాధితులకు 'ముక్కా' చేయూత

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

గత కొన్నేళ్లుగా నియోజకవర్గ ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న ముక్కా ఫౌండేషన్ మరోసారి తమ దాతృత్వ గుణాన్ని చాటుకుంది. ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం ఏ పని చేయలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఓ దళిత కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలబడి ఆదుకుంది. మండ లంలోని శెట్టిగుంట దళితవాడలో ఇటీవల రేవూరి మహేష్ అనే వ్యక్తి ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొంది ఇంటిదగ్గరే కోలుకుంటున్నాడు. ప్రస్తుతం ఏ పని చేయలేకపోవడంతో అతడి కుటుంబం రోజువారీ ఖర్చులకు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మీ ముక్కా ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా రూ.25వేలు తక్షణ ఆర్థిక సాయంగా అందించారు.

గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రామాపురం

వేసవికాలంలో ఆరు బయట నిద్రించేటప్పుడు ఇళ్లకు తాళాలు వేసుకొని ఇంటిసమీపంలోనే నిద్రించాలని ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆకతాయిలు, తాగుపోతులు ఎలాంటి చర్యలకైన పాల్పడవచ్చని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మండలంలోని చిట్లూరు పంచాయతీ చనికాయలపల్లెలో రామాంజ నేయులు, రవీంద్ర, మురళీకృష్ణ, నరసింహులుకు చెందిన నాలుగు ఇళ్లల్లో తలుపులకు పగలగొట్టి ఇంటిలోకి వెళ్లి ఇళ్లల్లో విలువైన వస్తువు లేక పోవడంతో ఉన్న వస్తువులను చల్ల చెదురుగా వేసి సంఘటన చోటు చేసుకుందని అన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ చంద్రశేఖర్ గంగాధర్ సంఘటన జరిగిన విధానంపై ఆరా తీసి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వేసవిలో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

క్రైం కార్నర్

నాటుసారా నిందితుడి అరెస్టును చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-రాయచోటి

30 లీటర్లు నాటుసారా, మోటార్ బైకు 60 లీటర్ల ఊటను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ శశిధర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి జి.మధుసూదన్ ఆదేశాల మేరకు ఎఇఎస్ అన్నమయ్య, వై.జోగేంద్ర ఆధ్వర్యంలో ఇఎస్‌టిఎఫ్ టీమ్ సంబేపల్లి మండలం శెట్టిపల్లి, పెద్దబిడికి అటవీ ప్రాంతంలో నాటుసారా స్థావరాలపై దాడులు చేసి పెద్ద బిడికి కి చెందిన ఆదిరెడ్డి నాయక్‌ను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 30 లీటర్లు నాటుసారా, సారా రవాణాకు ఉపయోగించిన మోటార్ బైక్‌ను స్వాదీనం చేసుకొని 60 లీటర్లు సారా ఊటను ప్రభుత్వం నవోదయం 2.0 అనే కార్యక్రమం చేపట్టి నాటుసారాను పూర్తిగా నిర్మూలించుటకు తగిన చర్యలు తీసుకుంటోందని తెలి పారు. ప్రజలు అందుకు సహకరించాలని తెలిపారు. అలా కాకుండా నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలు చేపట్టే వారిపై కేసులు నమోదు చేయ డమే కాకుండా పీడీ యాక్ట్ నమోదు చెయడం జరుగుతుందని హెచ్చరించారు. బెల్లం వ్యాపారులు ఎవ్వరూ నాటుసారా తయారీకి బెల్లం అమ్మరాదు, అట్లు అమ్మిన యెడల వారిపై కూడ కేసులు నమోదు చేసి జైలుకు పంపబడును అని తెలిపారు. ఈ దాడులలో ఈ ఎస్ ఎఫ్‌టిఎఫ్ సిబ్బంది వేమారెడ్డి, మోహన్ రెడ్డి, హుస్సేన్, బాలకృష్ణ, జానీ, రాజశేఖర్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మండలం సిటిఎం రైల్వే స్టేషన్‌కు కూత వేటు దూరంలో గుర్తు తెలియని యువకుడు రైలుకింద దూకి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగిన ఘటనపై కదిరి రైల్వే ఎస్ఐ రహీం తెలిపిన వివరాల మేరకు.. సుమారు 20 నుంచి 25 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని యువకుడు ధర్మవరం నుంచి నరసాపురం వెళుతున్న రైలు నుంచి కిందపడి సిటిఎం వద్ద ఆత్మహత్య చేసు కున్నట్లు తెలిపారు. ఘటనకు గల కారణాలు, మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. విచారణ చేసి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

మండల టిడిపి అధ్యక్షుడి ఇన్నోవా వాహనానికి నిప్పు

- విచారణ చేపట్టిన పోలీసులు

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని రామసముద్రం పంచాయతీ చెంబకూరు రోడ్డులోని గుంతలపేటలో నివాసమున్న టిడిపి మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్‌కు చెందిన ఇన్నోవా కారుకు మంగళవారం వేకువజామున దాదాపు రెండు గంటల సమయంలో నిప్పు పెట్టినట్లు పోలీస్ శాఖకు సమాచారం అందించారు. హుటాహుటిన మదనపల్లి రూరల్ సిఐ సత్యనారాయణ, ఎస్ఐ రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విజయ్ కుమార్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదుపై వివరాలు సేకరణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే నిపుణులు, పోలీస్ శాఖలో వివిధ రకాల డిపార్ట్మెంట్‌లు రంగంలోకి దించారు. మండల అధ్యక్షుడు కారుకి నిప్పు పెట్టారని విషయం తెలుసుకున్న మండలంలోని టిడిపి నాయకులు, కూటమి నాయకులే కాకుండా, పార్టీలకు అతీతంగా వైసిపి రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి కనగాని గెవన్న, వైసిపి మండల వైస్ ఎంపిపి వెంకటంమణరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ కేశవరెడ్డి సైతం ఆయన ఇంటివద్దకు చేరుకొని ఘటనపట్ల ఆరాతీశారు. అనంతరం ఆయన్ను పరామర్శించారు. మండలంలో ఎక్కడ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా, మండలం శాంతి భద్రతలను కాపాడాలని అధికార పార్టీ నాయకులు, ప్రతిపక్ష నాయకులు పోలీసులను కోరారు. ప్రజలతో సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ రామసముద్రం మండలం అంటేనే శాంతికి రూపంగా వుండేదని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో పోలీసుశాఖతో పాటు అన్ని సాంకేతిక నిపుణులతో నూతన పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఘటనకు కారకులపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కాలిపోయిన కారును పరిశీలిస్తున్న పోలీసులు

CHANGE OF NAME

I, PATAN AHAMAD ALI KHAN S/o Late P. RAHIM KHAN, D.No. 2-48, Konda Reddy gari Palli village, Garnimitta Post, K.V. Palli Mandal, Annamayya District., A.P., Changed myName as P. AHAMAD ALI KHAN S/o Late P. RAHIM KHAN and will be called as P. AHAMAD ALI KHAN here in after.

PUBLIC NOTICE

The property documents related to my property, owned by Sri, G.Munirathnamma, Wife of G.Mallikarjuna, residing at Kanduru road, Nimmanapalle village and Mnadal, Annamayya district, have been lost while my client was while travelling by bus from Madanapalle to Nimmanapalle. The missing document number is 25/2022 relating Survey Number 533,535 of Nimmanapalle village.

If anyone finds these documents, kindly inform the contact number provided below. A reward will be given to the person who returns them.
Contact: 9490773727

For any legal assistance, contact:
G.JANARDHANA REDDY, B.A., B.L.
(Advocate)
Address: Door No. 2-422-6A,
P and T Coloy , Madanapalle - 517325,
Annamaiah District.
Cell:9490773727.

IN THE COURT OF THE SECOND ADDITIONAL DIST. JUDGE OF MADANAPALLE
O.E.P. No.: 13/2020
O.S. No.: 14/2015

B. Harikrishna. ...**Decree Holder**
Vs
V. Seenivasulu. ...**Judgement Debtor**

NOTICE TO J.DR.

To,
V. Seenivasulu, S/o V.Venkataiyappa, Age: 56 years, Residing at Door No.14-73-3, Panjurammagudi Street, B. Kothakota Post and Mandal, Chittoor Dist. (Annamach District).

పై తెలిపిన E.P. నందు O.S. No. 14/15 తీర్పు డిక్రీని అమలుచేయుటకు E.P.Scheduled Property Attachment కొరకు దీనిని దాఖలు చేసినది. కావున మీరు 9.5.2025 నాటి ఉదయం 10.30 గం.లకు పై కోర్టు వారి ఎదుట హాజరు కావలసినదిగా తెలియజేయడమైనది.మీరు హాజరు కాకపోయిన యెడల ఏకపక్షంగా ఉత్తర్వులు అమలుపరచబడతాయి.

SCHEDULE

Chittoor District - B. Kothakota Sub District- B. Kothakota Mandal- B. Kothakota Gram Panchayath 1st Ward - Panjurammagudi Street - S.No. 657 - RCC Roofed House bearing D.No. 14-73-3.
Bounded on the:
East :By Road, West :By the site of Kaleel Khan, South :By the house of T. Lakshmana, North :By the house of Pagadala Narayana,
Within this, East to West 36' and North to South 25' with a total area of 100 sq. yards. Constructed RCC Roofed Ground Floor measuring East to West 36' and North to South 15' with a total area of 540 Sq.ft. First Floor measuring East to West 36' and North to South 15' with a total area of 540 Sq.ft including doors, windows, electrical fittings, etc.

N.S.N. PRASAD, B.Com.,B.L.,
Advocate, MADANAPALLI.